క్లుప్తంగా

గిరిజన శంఖారావం పోస్టర్ల విడుదల



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే కాటసాని

బనగానపల్లె : విజయవాడ తుమ్మలపల్లి కళ క్షేత్రంలో జనవరి 7న నిర్వహించనున్న గిరిజన శంఖారావం పోస్టర్లను శుక్రవారం స్థానిక స్వగృహంలో ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఆవిష్కరించారు. గిరిజనుల అభివృద్ధికి ప్రభుత్వం చేయూతనిస్తుందని ఈ సందర్భం గా ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో గిరిజన ప్రజాసమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజునాయక్, సహాయ కార్యదర్శి రవినాయక్, రాయలసీమ జిల్లాల ఇన్‌చార్జ్ రవీంద్ర నాయక్, నాయకులు రామాంజీ, ఈశ్వర్ నాయక్, సక్రునాయక్, విక్రంనాయక్, రామచంద్రనాయక్, హనుమాన్ నాయక్, వెంకటేష్‌నాయక్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రసవత్తరంగా బండలాగుడు పోటీలు



బండ లాగుతున్న వృషభాలు

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం శివారులో వెలిసిన మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం ఆలయ ఆవరణలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పాలపండ్ల బండలాగుడు, జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు రసవత్తరంగా కొనసాగాయి. ఈ పోటీలను ఈఓ పాండురంగారెడ్డి, చైర్మన్ సీతారామ చంద్రుడు ప్రారంభించారు. యువకుల ఈలలు కేరింతల మధ్య పోటీలు హోరాహోరగా సాగాయి. రాత్రి సాంస్కృతిక కార్యక్రమాలు, భక్త చింతామణి నాటక ప్రదర్శన జరిగింది.

చీరెల పంపిణీ



మహిళలకు చీరెలు అందజేస్తున్న దృశ్యం


డోన్ టౌన్ : పట్టణ సమీపంలోని లెప్రసీ కాలనీ మహిళలకు ప్రార్థన సమయం నిర్వాహకుడు జాన్ ప్రభాకర్ దాత సునీల్ ఆర్థిక సహకారంతో శుక్రవారం చీరెలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఏసు క్రీస్తు చూపిన సన్మార్గంలో నడుచుకోవాలన్నారు.

వైభవంగా పడిపూజ



బేతంచెర్ల: నంద్యాల రహదారిలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అయ్యప్పస్వామికి విశేష పడిపూజ వైభంగా నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. రాత్రి గురుస్వామి శ్రీ హరినారాయణ శిష్య బృందం, మాలధారులు, భక్త జనసందోహం మధ్య ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం, మూల విరాట్టుకు విశేష అలంకరణ చేసి, భజనలు, సంకీర్తనల తో విశేష పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యపసేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు గుండా జయచంద్రయ్య, బచ్చు సుబ్రహ్మణ్యం, మల్లు హుసేన్ రెడ్డి, గురుస్వాములు చిన్ని కృష్ణ, చంద్రశేఖర్, నాగేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం



పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న ఎంపీపీ, నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలోని షాదీఖాన భవనంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకొని డోన్ నియోజవర్గ స్థాయి పాస్టర్ల ఆత్మీయ సమ్మేళనం ఘనంగా జరిగింది. పాస్టర్లతో కలిసి ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, ఉర్దూ అకాడమీ రాష్ట్ర డైరెక్టర్ ముర్తుజావలి క్రిస్మస్ కేక్ కట్ చేశారు. అనంతరం మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి సహకారంతో పాస్టర్లకు దుస్తులు పంపిణీ చేశారు. మంత్రి బుగ్గన చొరవతో డోన్ నియోజవర్గంలో జరిగిన అభివృద్ధిని ఈ సందర్భంగా పాస్టర్లు గుర్తు చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

బేతంచెర్ల: కర్నూలు రహదారిలో జరుగుతున్న రహదారి విస్తరణ పనులను దృష్టిలో ఉంచుకొని మండలంలోని శంకలాపురం, ముద్దవరం, యంబాయి సబ్ స్టేషన్ల పరిధిలో శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 6గంటలకు వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏడీ మధుసూదన్‌రెడ్డి తెలిపారు. ఆ గ్రామాల్లో తెల్లవారు జామున 4 నుంచి ఉదయం 10 గంటల వరకు వ్యవసాయానికి విద్యుత్ సరఫరా ఉంటుందన్నారు.

ప్రాణదాత..‘108’

- ఆపదలో ఆదుకుంటున్న 108 అంబులెన్స్
- ఫోన్ చేసిన నిమిషాల్లో సంఘటనా స్థలానికి వాహనం
- అంబులెన్స్‌లో ఆధునిక పరికరాలు
- మూడేళ్లలో 4,920 మందికి పైగానే సాయం

కొలిమిగుండ్ల: ప్రజావైద్యానికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యతనిస్తుంది. ప్రత్యేకించి 108 అంబులెన్స్ ప్రాణదాతగా ప్రజల మన్ననలు పొందుతుంది. 108 సేవలను ఎంతో మంది ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. అర్ధరాత్రి అయినా మారు మూల గ్రామాల నుంచి ఆపద వచ్చింది అని ఒక్క ఫోన్ కాల్ వస్తే చాలు సిబ్బంది అప్రమత్తమై అక్కడికి చేరుకొని ఆసుపత్రికి తీసుకెళ్లి ఊపిరిపోస్తున్నారు. ప్రత్యేకించి అంబులెన్స్ గర్భిణులకు వరంలా మారింది. మండలానికి 2020లో అంబులెన్స్ మంజూరు అయ్యింది. కొలిమిగుండ్ల మండలానికి 2020 జూలై 1వ తేదిన అత్యాధునిక పరికరాలతో కూడిన 108 అంబులెన్స్‌ను కేటాయించారు అధికారులు. మండలంలో 23 గ్రామ పంచాయితీలు, 32 గ్రామాలు ఉండగా నాపరాతి గనులున్న నేపథ్యంలో తరుచూ ప్రమాదాలు జరుగుతూనే ఉంటాయి. మూడు ఏళ్లకు పైగా 108 వాహన సేవలు అందుతున్నాయి. ఇప్పటి వరకు 4,920 మందికి పైగానే సాయం పొందారు. వీరిలో 60 శాతం గర్భిణలు ప్రసవాలకు సంబంధించి ఆసుపత్రులకు వెళ్లేందుకు ఉపయోగించుకున్నారు. 20 శాతం రోడ్డు ప్రమాదాలు, తదితర కేసులకు సంబంధించి బాధితులకు సేవందించారు 108 సిబ్బంది. 108 అంబులెన్స్ 2.10 లక్షల కి.మీ మేర తిరిగింది.

టీడీపీ హయాంలో నిర్వీర్యం: దివంగత మహానేత ప్రవేశపెట్టిన 108 వాహన సేవలను 2014లో అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పూర్తిగా నిర్వీర్యం చేసింది. కొలిమిగుండ్ల మండలానికి కేటాయించిన 108ను అప్పట్లో ఇతర మండలాలకు తీసుకెళ్లడంతో మండల ప్రజలు చాలా ఇబ్బందులు పడ్డారు. ప్రజలు ఇబ్బందులు గుర్తించిన దివంగత వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత ఎర్రబోతుల వెంకటరెడ్డి రూ.7లక్షల స్వంత నిధులు వెచ్చించి మానవతా స్వచ్ఛంద సంస్థకు అంబులెన్స్ విరాళంగా అందజేశారు. ఎంతో మందిని సకాలంలో ఆసుపత్రులకు తీసుకెళ్లి ప్రాణాప్రాయం నుంచి కాపాడారు.



కొలిమిగుండ్ల గ్రామ సచివాలయం వద్ద ఉన్న 108 అంబులెన్స్

108 బాగా ఉపయోగపడింది



మాది కొండమీదపల్లె గ్రామం. నేను గర్భిణిగా ఉన్న సమయంలో డెలివరీ సమయం వచ్చింది. ఆసుపత్రికి తీసుకెళ్లాల్సి ఉంది. మాఊరు కొండపై ఉండటంతో పెద్దగా వాహనాలు అందుబాటులో ఉండవు. కుటుంబ సభ్యులు 108 కోసం ఫోన్ చేసిన వెంటనే 108 వచ్చింది. డెలివరీ కోసం తాడిపత్రికి తీసుకెళ్లాం. గతంలో రోడ్డు లేక 108 వచ్చేది కాదు. ఇప్పుడు తారురోడ్డు ఏర్పాటు చేయడంతో నేరుగా వాహనం కొండపైకి వస్తుంది. నాకే కాదు చాలా మంది గర్భిణులకు 108 వాహనం బాగా ఉపయోగపడింది.

– సరస్వతి, కొండమీదపల్లె

సకాలంలో సంఘటనా స్థలానికి



ఏ సమయంలో ఫోన్ వచ్చినా వెంటనే స్పందిస్తాం. సాధ్యమైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకుంటాం. 108 వాహనం కొత్తది కావడంతో అన్ని రకాల ఫ్యూచర్లు ఉన్నాయి. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులు, గర్భిణులు ఇతర కేసులకు సంబంధించి తమవంతు సేవలు అందజేశాం. బాధితుల విన్నపం మేరకు తాడిపత్రి, బనగానపల్లె, జమ్మలమడుగు ప్రభుత్వ ఆసుపత్రులకు తీసుకెళ్తుంటాం. ప్రజలకు ఎల్లప్పుడు 108 అందుబాటులో ఉంటుంది. తమకు చాలా తృప్తిగా ఉంది.

–పవన్‌గోపాల్, పైలెట్

రూ.1.60 కోట్లతో ఓవర్‌హెడ్ ట్యాంకులు

- భూమి పూజ చేసిన ప్రజాప్రతినిధులు, అధికారులు

కోవెలకుంట్ల: స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ పరిధిలో జలజీవన్ మిషన్ కింద రెండు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణానికి శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు భూమి పూజ చేశారు. దాసరిపేట, పట్టణ శివారులోని సాయిబాబాగుడి సమీపాల్లో ఒక్కో ట్యాంకు రెండు లక్షల లీటర్ల సామర్థ్యంతో ఏర్పాటుకు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో రూ. 1.60 కోట్లు మంజూరయ్యాయి. ఆయా ప్రాంతాల్లో ట్యాంకుల నిర్మాణానికి ఏపీ ఇరిగేషన్ డవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, జెడ్పీటీసీ వెంకటలక్ష్మమ్మ తదితర నాయకులతో కలిసి సర్పంచ్ మెట్ల సరళ, ఉపసర్పంచ్ జీసీఆర్ సూర్యనారాయణరెడ్డి భూమిపూజ చేశారు. ట్యాంకుల నిర్మాణం పూర్తి అయితే పట్టణ ప్రజలకు శాశ్విత తాగునీటి కష్టాలు తీరిపోనున్నాయి. కార్యక్రమంలో మండల కో ఆప్షన్‌మెంబర్ దిల్కాబాషా, రైతు సంఘం నాయకుడు కానాల రవీంద్రనాథరెడ్డి, పాండురంగస్వామి దేవాలయ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ మధుసూదన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు నాట్ల వెంకటేశ్వరెడ్డి, చిక్కేపల్లి ప్రసాదరెడ్డి, గువ్వల రామకృష్ణారెడ్డి, గడ్డం వరప్రసాదరెడ్డి, సుధాకర్‌రెడ్డి, జి. లక్ష్మిరెడ్డి, గుద్దేటి చంద్రశేఖర్‌రెడ్డి, అక్బర్‌బాషా, దేవరాజు, ఈఓపీఆర్‌డీ రాధిక, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరీష్, గ్రామ వలంటీర్లు పాల్గొన్నారు.



ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

నేడు వైకుంఠ ఏకాదశి



ముస్తాబైన పాండురంగస్వామి దేవాలయం

కోవెలకుంట్ల: వైకుంఠ ఏకాదశి వేడుకలు శనివారం భక్తిశ్రద్ధలతో జరుగనున్నాయి. ఈ మేరకు వైష్ణవ ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరస్వామి దేవాలయంలో వేడుకలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏకాదశిని పురష్కరించుకుని ప్రధాన అర్చకు లు వేణుగోపాలచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వ ర్యంలో ప్రత్యేక పూజల అనంతరం ఉత్తర ద్వారం ద్వారా స్వామి దర్శన భాగ్యం కల్పించనున్నారు.

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని భానుముక్కలలో వెలసిన శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ముక్కోటి ఏకాదశి వేడుకలు వైభవంగా నిర్వహించేందుకు ఆలయ పునర్నిర్మాణ కమిటీ చైర్మన్ డాక్టర్ గాథంశెట్టి రవికుమార్, సభ్యులు ఏర్పాట్లు చేశారు. ప్రత్యేక పూజల అనంతరం 3 గంటల నుంచి ఉత్తర ద్వారం నుంచి భక్తులకు ఆర్జిత సేవలు, సర్వదర్శనం ఉంటుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

వేంకటేశ్వర స్వామి ఆలయం ముస్తాబు

డోన్ : మండల పరిధిలో వెలసిన ఆవులదొడ్డి వేంకటేశ్వర స్వామి ఆలయం వైకుంఠ ఏకాదశి ఉత్సవాలకు ముస్తాబైంది. ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకొని శనివారం ఉత్తర ద్వార దర్శనం, స్వామి వారి కళ్యాణోత్సవానికి భారీ ఏర్పాట్లు చేశారు. 24వ తేదీన స్వామివారి గ్రామోత్సవం ఆలయం నుండి ఆవులదొడ్డి గ్రామం వరకు నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయ ఆవరణలో 30 అడుగుల ఆంజనేయస్వామి విగ్రహం భక్తులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

వేంకటేశ్వర ఆలయంలో పూజలు

డోన్ టౌన్ : అయోధ్యలోని రామజన్మ భూమి ట్రస్టు నుంచి వచ్చిన అక్షింతలకు శుక్రవారం స్థానిక వేంకటేశ్వర ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ప్రఖండ రామారాజేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మండలంలోని 42 గ్రామాల నుంచి వచ్చిన రామ భక్తులకు వాటిని అందజేశారు. జనవరి 1 తేదీ నుంచి ప్రతి ఇంటికి అందించాలని కోరారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి తొగట సురేష్‌బాబు అక్షింతల ప్రాముఖ్యత వివరించారు.

పౌష్టికాహారం కిట్ల పంపిణీ

డోన్ టౌన్ : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం సూపరిడెంట్ డాక్టర్ మహ్మద్ హనీఫ్ ఆధ్వర్యంలో క్షయవ్యాధి గ్రస్తులకు పౌష్టికాహార కిట్లను అందజేశారు. కార్యక్రమంలో డాక్టర్లు ఆర్‌కే రెడ్డి, టీబీ వ్యాధి నిర్మూలన ప్రచార సూపర్‌వైజర్లు అరుణకుమార్, కరీం పాల్గొన్నారు.

భ్రూణ హత్యలు నివారించాలి

డోన్ టౌన్ : సమాజంలో లింగ వివక్షత రూపుమాపాలంటే భ్రూణ హత్యల నివారించడం అందరి బాధ్యత అని మోడల్ స్కూల్ ప్రిన్స్‌పాల్ జాస్మిన్, సామాజిక కార్యకర్త, భ్రూణహత్యల నివారణ కమిటీ సభ్యుడు మమ్ముద్‌రఫీ తెలిపారు. శుక్రవారం పట్టణ సమీపంలోని మోడల్ స్కూల్లో భ్రూణ హత్యలు, పిండ లింగ నిర్ధారణ పరీక్షలు, చట్టం తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.

నేటి నుంచి దర్గా ఉరుసు

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని పాత ఆంధ్రా బ్యాంకు రోడ్డు సమీపంలో వెలసిన శ్రీహజరత్ సయ్యద్ గరీబ్ షా వలి ఖాద్రి దర్గా ఉరుసు శనివారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు దర్గా వంశీయులు సయ్యద్‌ఖాజాబాషా ఖాద్రి శుక్రవారం తెలిపారు. 23న గంధం, 24న ఉరుసు, 25న జియారత్ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఖాద్రి కోరారు.

పిల్లలను బడిలో బాధ్యతగా చేర్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ సుధాకర్ రెడ్డి

ప్యాపిలి: బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించాల్సిన బాధ్యత హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులదే అని డీఈఓ సుధాకర్ రెడ్డి అన్నారు. స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆయన హెచ్‌ఎంలతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు పిల్లలు తప్పనిసరిగా బడిలో ఉండాలన్నారు. హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు తమ పరిధిలో ఇంటింటికీ తిరిగి సర్వే నిర్వహించాలన్నారు. బడి బయట ఉన్నవారిని గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్చుకోవాలన్నారు. ఈ విషయమై పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. అనంతరం బడి ఈడు పిల్లలను బడిలో చేర్పాలంటూ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన ర్యాలీలో డీఈఓ పాల్గొన్నారు. కార్యక్రమంలో ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ లక్ష్మీనారాయణ, ఎంఈఓలు వెంకటేశ్వర్లు నాయక్, పద్మాబాయి, సరళాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఉప్పలపాడులో ప్రజాభిప్రాయ సేకరణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఆర్‌ఓ పుల్లయ్య

అవుకు: మండల పరిధిలోని ఉప్పలపాడు గ్రామంలో శుక్రవారం డీఆర్‌ఓ పుల్లయ్య ఆధ్వర్యంలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. అవుకు మండలం ఉప్పలపాడు, జూనూతల, చెర్లోపల్లె గ్రామాల పరిధిలో ఎన్‌ఆర్‌ఈడీసీఏపీ వారు 800 మెగా వాట్లతో హైడ్రో ఎలక్ట్రిక్ పంప్డ్ స్టోరేజ్‌ను నిర్మించటానికి ఆయా గ్రామాల నుంచి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. ప్రాజెక్ట్‌ను నిర్మించటానికి తమకు ఎలాంటి అభ్యంతరాలు లేవని ఆయా గ్రామాల ప్రజలు తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ పోతుల ప్రసాద్ బాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు చల్లా సూర్యప్రకాశ్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మీ, నాయకులు చల్లా చైతన్య రెడ్డి, చరణ్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, నారాయణ రెడ్డి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

కొలిమిగుండ్ల: మండలంలోని గ్రామాల్లో నెలకొన్న చిన్న చిన్న సమస్యలు పరిష్కారానికి కృషి చేయనున్నట్లు రిటైర్డ్ హెచ్‌ఎం పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్ట్ చైర్మన్ పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కొలిమిగుండ్లలోని ట్రస్ట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతు రాజకీయాలకు అతీతంగా జనవరి 10 నుంచి వారంలో మూడు గ్రామాల చొప్పున పర్యటించి తాగునీటి పైపులైన్‌ల మరమ్మతులు, శ్మశాన వాటికల అభివృద్ధితో పాటు మైనర్ పనులు గుర్తించి పరిష్కరిస్తామన్నారు. తీవ్రత ఎక్కువగా ఉన్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.

జాతీయ రహదారి నిర్మాణానికి సహకరించాలి



మాట్లడుతున్న తహసీల్దార్ మల్లికార్జున రావు

సంజామల: నంద్యాల–జమ్మలమడుగు 167కే నేషనల్ హైవే రోడ్డు నిర్మాణం కొరుకు భుములు కోల్పోయిన రైతులు సహకరించాలని తహసీల్దార్ సూచించారు. శుక్రవారం నొస్సం సచివాలయంలో నిర్వహించిన త్రీజీ అవార్డు విచారణ సభలో తహసీల్దార్ మల్లికార్జున రావు, నేషనల్ హైవే సెక్షన్ అధికారులు యూసప్ నాయక్, రఫీ రైతులతో ముఖాముఖి నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ నొస్సం, అక్కం పల్లె గ్రామాలకు చెందిన రైతులకు సంబంధించి 76.42 ఎకరాలు హైవే నిర్మాణానికి అవసరం ఉందని, సహకరించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ అనిల్, ఆర్ఐ వెంగల్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ

డోన్ : పట్టణంలోని మారు మూల ప్రాంతాలకు కూడ మౌలిక వసతులు కల్పిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ అన్నారు. 18వ వార్డు ఆలావారి వీధిలో రూ. 35లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం మున్సిపల్ వైస్ చైర్మన్‌లు కొ్ట్రికె హరికిషన్, జాకీర్‌లతో కలిసి ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని 32 వార్డుల్లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన పనులను మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి చొరవతో మంజూరైన రూ.6.40కోట్ల ప్రత్యేక నిధులతో చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ మల్లికార్జునరెడ్డి, కమిషనర్ వెంకట్రామిరెడ్డి, డీఈ రసూల్, ఏఈ సురేష్, వైఎస్సార్‌సీపీ నాయకులు రాందాసు, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.



భూమి పూజ చేస్తున్న చైర్మన్ రాజేష్

ఘనంగా గణిత దినోత్సవం



గణితం ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

సంజామల: మండల పరిధిలోని కానాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ గణిత దినోత్సవ వేడకలు ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం అరుణ కుమారి, ఉపాధ్యాయులు సావిత్రమ్మ, ఓబులేసు, మౌలాలి తదితరులు శ్రీనివాస రామానుజన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గణిత శాస్త్రం ఉపాధ్యాయులను సన్మానించారు.

రామానుజన్ జయంతి

బనగానపల్లె రూరల్ : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్రవిభాగం అధ్యాపకులు బాబునాథ్ ఆధ్వర్యంలో శ్రీనివాసన్ రామానుజన్ జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ స్వర్ణలతాదేవి విద్యార్థులు రామానుజన్ గణితాన్ని తెలుసుకొని ఉన్నతమైన విద్యార్ని విద్యార్థులుగా రాణించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు విజయకుమారి, సూర్యనారాయణరెడ్డి, సుధాకర్‌రెడ్డి, వసుంధర, కౌసల్యదేవి, వరలక్ష్మీ,వహీదా, రామన్న, ఉమామహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : గణితంపైన మక్కువ ఉంటే గణితం చాలా ఈజీ అని హెచ్‌ఎం వెంకటసుబ్బారెడ్డి అన్నారు.గణితశాస్త్రవేత్త శ్రీనివాసరామానుజన్ జయంతి పురష్కరించుకుని శుక్రవారం పాతపేట హైస్కూల్లో ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జనిత గణితం పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో గణితం ఉపాధ్యాయులు లక్ష్మీకాంతరెడ్డి, మధుసూదనరెడ్డి, సుభాన్, విజయ్‌కుమార్, సురేష్, వెంకటరమణ, సుబ్బరాయుడు తదితరులు పాల్గొన్నారు.

మమ్మద్ రఫీ ఆధ్వర్యంలో : సామాజిక కార్యకర్త మమ్మద్ రఫీ ఆధ్వర్యంలో పట్టణంలో ఏంపీపీ స్కూల్‌లో రామానుజం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. రామానుజం జీవిత చరిత్రను హెచ్‌ఎం రామునాయక్ వివరించారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని గోసానిపల్లి ప్రాథమికోన్నత ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గణిత ఉపాధ్యాయుడు సుందరామయ్యను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా సన్మానించారు.

రామానుజన్ సేవలు అమోఘం



పాతపేట హైస్కూల్లో నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్యాపిలి: గణితరంగానికి శ్రీనివాస రామానుజన్ చేసిన సేవలు అమోఘమైనవని డీఈఓ సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని పీఆర్ పల్లి గ్రామంలో స్థానిక ఉన్నత పాఠశాలలో నిర్వహించిన గణిత దినోత్సవంలో డీఈఓ పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఈఓ మాట్లాడుతూ పేద కుటుంబంలో జన్మించిన శ్రీనివాస రామానుజన్ గణితంలో అనేక ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. కార్యక్రమంలో ఎంఈఓ వెంకటేష్ నాయక్, హెచ్‌ఎం శ్రీధర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్ : స్థానిక నెహ్రూనగర్ జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం జాతీయ గణితశాస్త్ర దినోత్సం పురష్కరించుకొని గణితవేత్త శ్రీనివాసరామానుజన్ చిత్ర పటానికి హెచ్‌ఎం తొగట సురేష్‌బాబు, ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళుర్పించారు. అనంతరం గణితశాస్త్ర ఉపాధ్యాయులు శివశంకరయ్య, లక్ష్మీనాయక్‌ను సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వరగౌడ్, వెంకటేశ్వరరెడ్డి, మౌలాలీ, శారధాదేవీ, సునీత, రామకృష్ణారెడ్డి, రాంప్రసాద్ పాల్గొన్నారు.

రేపటి నుంచి జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు

కొలిమిగుండ్ల: క్రిస్మస్ పండుగను పురష్కరించుకొని ఆది, సోమవారాల్లో బెలుం సీఎస్ఐ చర్చి ఆవరణలో సంఘ పెద్దల ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు రూ.250 ఎంట్రీ ఫీజు చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. విజేత జట్లకు దాతల సహకారంతో వరుసగా రూ.15,016, 10,016,రూ.7016,రూ.5016 అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

24 నుంచి పాతపేట రైల్వేగేట్లు మూసివేత

డోన్ రూరల్ : పట్టణంలోని స్థానిక పాతపేటకాలనీలో ఉన్న రైల్వే గేట్లను ఈనెల 24 నుంచి జనవరి 2వ తేదీ వరకు మూసి వేస్తున్నట్లు రైల్వే స్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు...ట్రాక్ మరమ్మతుల పనులలో భాగంగా ఉదయం 7గంటల నుంచి రాత్రి 7గంటల వరకు గేట్లు మూసివేడం జరుగుతుందన్నారు. అలాగే ఈ ట్రాక్‌పై సికింద్రబాద్ నుంచి గుంటూరు, కాచిగూడ నుంచి గుంతకల్, గుంతకల్ నుంచి బోధన్‌కు వెళ్లె రైళ్లను కూడా బంద్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రజలు, ప్రయాణికులు సహకరించాలని ఆయన కోరారు.

ఆటో బోల్తా- నలుగురికి గాయాలు

కోవెలకుంట్ల: కోవెలకుంట్ల- జమ్మలమడుగు ఆర్‌అండ్‌బీ రహదారిలో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మహిళలు గాయపడ్డారు. స్థానికుల సమాచారం మేరకు.. మండలంలోని భీమునిపాడు గ్రామానికి చెందిన 10 మంది మహిళా కూలీలు పొట్టిపాడు సమీపంలో మిరప కోత పనులకు ఆటోలో బయలు దేరారు. పొట్టిపాడు మెట్ట సమీపంలో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో నాగమ్మ, లావణ్య, లక్ష్మిదేవి, వేదమ్మ గాయపడ్డారు. క్షతగాత్రులను అదే ఆటోలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రాథమిక చికిత్స అనంతరం వేదమ్మ మినహా మిగిలిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాద సంఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

డోన్‌లో చోరీ

డోన్ టౌన్ : పట్టణ శివార్లలోని సాయినందన్ వెంచర్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న లారీ యజమాని సురేష్‌రెడ్డి శుభకార్యాల నిమిత్తం అతను కర్నూలుకు, భార్య హైదరాబాద్‌కు గురువారం సాయిత్రం వెళ్లారు. అలాగే పక్కింటిలో నివాసం ఉంటున్న రైల్వే ఉద్యోగి శేఖర్ ఓ వివాహానికి వెళ్లాడు. సురేష్ రెడ్డి ఇంటి తాళం పగులగొట్టి రెండు తోలాల నక్లిసు, తులంనర చైన్, మూడ జతల కమ్మలు, 25 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.30వేలను దుండగులు దోచుకెళ్లారు. బాధితుడు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రైల్వే ఉద్యోగి శేఖర్ ఇంటిని ప్రయత్నించినా తాళం రాలేదు.

బనగానపల్లెలో...

బనగానపల్లె రూరల్ : పట్టణంలోని స్టేట్ బ్యాంకు రోడ్డులో ఉన్న నాగ ప్రసాద్ దుకాణంలో చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు లాల్ మసిద్‌లో వీధిలో నివాసం ఉంటున్న నాగప్రసాద్ స్టేట్ బ్యాంకు రోడ్డులో చిల్లర దుకాణం ఏర్పాటు చేసుకున్నా రు. అయితే గురువారం అంగడి తాళం వేసి ప్రక్క వీధిలో ఉన్న ఇంటికి వెళ్లాడు. రాత్రి దుండగులు దుకాణం తాళాన్ని తొలగించి అంగడిలోకి ప్రవేశించి బీరువాలోని సుమారు రూ.60వేల నగదు. రూ. 3 వేల విలువ కాళ్ల మెట్టెలు. రూ.2వేల విలువ సిగరెట్ బాక్స్‌లు, చిల్లరను దోచుకెళ్లిన్నట్లు నాగప్రసాద్ తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఎస్ఐ రామిరెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గ్రామాలకు అయోధ్య రామాలయ అక్షింతలు

కొలిమిగుండ్ల: అయోధ్య రామాలయం నుంచి వచ్చిన అక్షింతలను మండలంలోని అన్ని దేవాలయాలకు పంపేందుకు ఏర్పాట్లు చేశామని బనగానపల్లె విశ్వహిందూ పరిషత్ కార్యనిర్వాహక సభ్యులు కిషోర్ శుక్రవారం తెలిపారు. కొలిమిగుండ్లలోని సీతారామాలయం చేరిన అక్షింతలను పరిశీలించారు. ముక్కోటి ఏకాదశి సందర్భంగా అన్ని దేవాలయాల్లో ఉంచేందుకు అక్షింతలను పంపిణీ చేస్తున్నామన్నారు. జనవరి 1వ తేది నుంచి 5వరకు గ్రామాల్లో ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు చలమయ్య, భవాని, రాముడు, చంద్రశేఖర్, మునిగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మితిమీరిన అభిమానం

డోన్ : సినీ హీరోపై అభిమానం మితిమీరింది. పట్టపగలు నడి రోడ్డుపై మూగజీవాలను బలి ఇచ్చిన ఘటన పట్టణంలోని శ్రీరామ థియేటరు ఎదుట శుక్రవారం చోటు చేసుకుంది. సినీ హీరో ప్రభాస్ నటించిన సలార్ చిత్రం విడుదలను పురష్కరించుకుని ఆయన అభిమానులు చిగుమానుపేట నుంచి పొట్టేళ్లతో ర్యాలీగా వచ్చి వందలాది మంది అభిమానులు, ప్రజల సమక్షంలో వేట కొడవలితో మూగజీవాలను నరికేశారు. ఎక్కడో గ్రామ దేవర ఉత్సవాల్లో కన్పించే సంఘటనలు పట్టణంలో జరగడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

